కథానిక :

# పరమార్థం

★

శ్రీ మంథా వెంకటరమణరావు

"వెంకట్రావుగారు మీకు తెల్సునుకదూ?" వెనుకకి చేతులు కులాసాగా వదిలి అన్నారు మాష్టారు.

దగ్గరగాఉన్న తోటలోనుండి చల్లటి గాలి తెర, నీటికెరటంలా తాకుతూ పోయింది. నిండా బియ్యం వేసుకున్న ఒక లార్రీ దారి కడ్డుగా ఉండిపోయింది. క్లీనరు లేని అరవ డ్రయివరు 'బోనట్' మీదకెత్తి ఏదో మర సరిజేస్తున్నాడు. దారిలేక మరొకలారీ ముందుకి కొంత దూరాన్న నిలబడిపోయింది, పెట్రోలు కొలుస్తూ.

మొదటి గొడాము ద్వారంముందు '52 మోడలు ఫోర్డుబండీ, నగ్నంగాఉన్న కొండదానిలా నిల్చొంది. ఒక అడుగు వెడల్పుగానున్న బల్లమీదుగా కూలీలు, తూకం వేసిన బియ్యం బస్తాలను సర్కసు ఫీటులా వీపులమీద బేలెన్సుచేస్తూ తీసుకపోయి లారీలో కుదేస్తున్నారు.

"అంటే?" కొద్దిగా ముందుకు వంగి జ్ఞాపకం తెచ్చుకుంటున్నవాడిలా అడిగేను.

"మూడేళ్ల క్రితం పోయేడులెండి. పాపం, చిన్న కాలంలో నే పోయేడు."

"అంటే........."

"అంత చిన్నతనమనీ కాదు. ఓ నలభైఎనిమిది, ఆముక్క నుండొచ్చు. నేను, ముదలియారు, వెంకట్రావు, నరసింహం మేమంతా ఒకదోస్తీ, ముప్ఫై మూడు ఆ ప్రాంతంనుంచీ."

అరవ డ్రయివరు లారీ స్టార్టు చేశాడు.

బియ్యం వేసుకున్న ఎర్ర లారీ ముందుకు వస్తోంది, మొదటి గేరులో, మరాం పెడుతున్న కుర్రవాడిలా.

ఆరిపోయిన చుట్టని, సిగర్ లైటరుతో ముట్టిస్తూ అన్నారు మాష్టారు. "ఈ లైటరు చూసేరా? పదేళ్ళయింది."

ఇత్తడిగిద్దెలా ఉంది లైటరు. అంత పెద్దదీ ఔను. చక్రం ఉన్నచోట టంకంతో పెద్ద అతుకు, నాగులచవితికి చెవికి అంటించుకున్న పూజాప్రసాదంలా. పెట్రోలుపోసేద్వారాన్ని కప్పే మర పోవడంవల్ల దానిస్థానా న్నొక జీలుగుబెండు ఆక్రమించుకుంది. లైటరుకంటి కింపుగా లేకపోయినా చేతికి నిండుగా ఉంది.

"అబ్బా......!" చేతిలోకి తీసుకొనేటందుకు ధైర్యం చాలక దూరంనుంచే చూస్తూ ఆశ్చర్యపోతున్నట్టు ముఖంపెట్టి అన్నాను.

"ఇది, అతనిదగ్గర తీసుకున్నదే. సర్వీసుచేసిచేసి నాదగ్గర కొచ్చింది. వాళ్ల మేనమామదగ్గర అతను కొట్టేసేడు. మొత్తం ఎన్నేళ్లయిందో లెక్క వేసుకోండి."

చిన్న నవ్వునవ్వి వెనుకకి చేరబడ్డాను ఏం చెయ్యాడమో తెలియక.

ఎర్రలారీ కనుపించకుండా పోయింది రోడ్డుమీద. ఒక 'చివర్లెట్' బండీవచ్చి నిలబడింది బస్తాలు వేయించుకోడానికి. లారీ నిలబెట్టి, చక్రం విప్పడం మొదలెట్టేడు డ్రయివరు.

చుటపొగ గాలిలోకి వదిలి, ఓ సారాకాశాన్ని, కళ్ళు చిట్లిస్తూ చూసి అన్నారు మాష్టారు. "ఓ చిన్న కథ చెప్పనా?" కొన్ని సెకెండ్లూరుకొని అన్నారు. "నిజంగా జరిగిందే ఇది."

గాలికి, అతడి తలమీది పండు వెంట్రుకలు, వెన్నుభారంతో ముంగుకు వంగిపోయిన చేలులా ఉన్నాయి. అతడి నుదుటిమీది ముడకముద్ప కమ్ముకొస్తున్న చీకటిలో కలిసిపోయింది. బావాజీ కొండవేపు తీతువు అరుచుకుంటూ పోయింది.

"ఇంకా మనవాడొచ్చేటట్టు లేడు. కానీండి," గంట్రిందటే వేసుకున్న తెల్లపంట్లాము నలిగిపోకుండా మీదకు లాగుతూ అన్నాను.

గొంతు సరిజేసుకొని ఒకపొడిదగ్గు దగ్గి అన్నారు మాష్టారు. "రాయాలిసుమండీ!"

మాష్టారి పాత జీవితంలో రోజు కొక కథ తియ్యొచ్చు. అతడు చెప్పడంకూడా గొప్ప నేర్పుతో 'సస్పెన్సు' కొసవరకూ ఉంచి మంచి రసవంతంగా చెప్పుకొస్తాడు. అది వ్రాసేటందుకు శిల్పంకోసం ఆలోచించడంకూడా అనవుసరం.

"మూడు ఎనిమిదిలు, ఒక ఆరు—" కేక లేస్తున్నాడు గోదాము గుమస్తా. బస్తాలొక్కొక్కటే వెళ్తున్నాయి లారీలోనికి, కూలీల వీపులమీదుగా. ఒక్కొక్క బస్తా కుదేస్తూఉంటే, తుఫానుగాలికి చెట్లూగిపోయినట్టు ఊగుతోంది లారీ. ముప్పైబస్తాలు వెయ్యడం పూర్తయేసరికి అది కాస్తా విరిగూరుకుంటుందేమో ననిపించింది.

"ఓసారి షికారు వెళ్లేం" మాష్టారు మొదలెట్టేరు.

"ఎవరెవరు?" కాలుమీద కాలు వేసుకుంటూ అడిగేను.

"మాదోస్తీ బృందం. ఇప్పుడు పెట్రోలు బంకుంది చూసేరా? అటు వేపు."

"అయితే ఇది ఈఊళ్లో జరిగిందా మాష్టారూ?" ఆత్రంగా ముఖం ముందుకి తెస్తూ అన్నాను.

"చెప్తాంటే నే. మేం నలుగురం రోజూ షికారుపోయేవాళ్ళమే అనుకోండి. ఆరాణీ తోట వేపు పోయేవాళ్ళం. కాని ఆరోజు బుద్ధిపుట్టి ఇటు వేపు వెళ్ళేం."

చుట్టపొగలాగుతూ అప్పారావుగారు లారీవెనుకనుండొచ్చారు మా వేపు.

"ఏవండోయి. మొన్న మేమంతా షికారెళ్లేం బావాజీ కొండవేపు" కాళీగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అన్నాడాయన.

"మాష్టారున్నారా?"

"అయ్యో! లేకేం! ఈ పాటివేళా అయింది. దీని తస్సాదియ్యా. సగం దారి వెళ్లేటప్పటికి మా పక్కనే పులి అరిచింది."

ఆశ్చర్యంగా చూస్తూ అడిగేను. "పరుగు లంఘించుకున్నారా?"

"లేదులెండి," మాష్టారు నవ్వుతూ అన్నారు. "నడక వేగం మాత్రం ఎచ్చిచేం."

టేబిలు మీదనున్న అగ్గిపెట్టె తీసి. ఒక్కపుల్ల కొడుతూ అన్నాను. "మీ కథ కానీండి మాష్టారు."

విషయం మారడంవలన రసం పోయినట్టయిందేమో "తరవాత తీరుబడిగా చెప్తాలెండి" అన్నాడాయన, చుట్టకు కట్టిన కొడిని చిటికిన వ్రేటిలో దులిపి, కొంతకాలం ఊరుకుని అన్నాడాయన. "ఈ లారీలు, ఈ గొడవ చూసేరూ?"

"వాటి గొడవ వాటిది. మన కథకేం ఆటంకం లేదు మాష్టారూ. కానీండి." వాసన చూపించి పండు విసిరేస్తున్నట్టయి అన్నాను.

చుట్ట మొదటికున్న నిప్పు ఎరుపుదనాన్ని పరీక్ష చేస్తూ అన్నారు అప్పారావుగారు. "మన వాడింత వేగంరాడు. ఇంకో నాలుగు లారీలకి పెర్మిట్లివ్వాలి."

"అయితే చెప్పొచ్చే దేమిటంటే ఆ బంకు వేపు షికారు వెళ్లేం. అక్కడ కొనాఉంది చూసేరూ? ఇప్పుడంటే ఇవన్నీ తారురోడ్లయేయి కాని అప్పుడంతా మట్టే. మీ రింకా పుట్టేరో లేదో. పుట్టినా పాలుతాగే వారేమో!"

"ఉఁ" కొడుతున్నాన్నేను ప్రతి వాక్యం ఆఖరికీ. అప్పారావుగారు కళ్ళద్దాలు సర్దుకొని, కళ్లు రెపరెపలాడించి, ఏదో ఫీలుస్తున్నట్టు ముక్కుతో

శబ్దం చేసి, మాస్టారి ముఖంలోనికి చూస్తూ కూర్చున్నారు.

"ఆ కొనామీద ఒక బావాజీ కూర్చున్నాడు."

"ఒస్! బావాజీ కథా!" ఒక నిట్టూర్పు విడిచి ఏదో బరువు తగ్గిపోయినట్టన్నాను.

"జరిగింది చెప్తాం లేసే. వినరేం?"

"చెప్పండి, చెప్పండి." అడ్డు చెప్పకూడదని నిశ్చయించుకుని, తప్పు కప్పుకుంటున్న వాడిలా నవ్వి అన్నాను.

కొసవరకు కాలిన చుట్టని క్రిందకు విసిరికొట్టి క్రొత్తదానికోసం జేబులో చెయ్యి పెట్టేరప్పారావుగారు. చెయ్యి కాళీగా వచ్చింది. ఆ చేతితోనే కళ్లద్దాలు సరిచేసుకుని, కాళ్ళు మరింత దగ్గరిగా లాక్కొని వింటూ కూర్చున్నారు ఒక బుద్ధిమంతుడిలా.

"అందరిలోనూ ఈ వెంకట్రావుకీ నాకూ బాగా దోస్తీ." మాస్టారు చెప్పకపోయేరు. "ఇద్దరం చాలా కలిసికట్టుగా ఉండేవాళ్ళం. మా వీధి కొట్టుంది చూసేరూ. అందులో బస. ఎక్కడ! ముప్పైఏళ్ళ క్రితం నుంచి కలిసి తిరుగుతూ ఉండేవాళ్ళం." ఒక్క సెకెం డూరుకుని, చుట్ట పీల్చి, నా ముఖం మీదికి పొగ వదుల్తూ అన్నారు.

"ఓసారి ఇంటిదగ్గర పెట్టిన చోవిరొట్టె ఆపాశంగా మింగేసి, రామా హొటల్లో పదిఇడ్లీ, కాఫీ కాళీచేసి, నే నెదురుపడగానే బ్రదర్ టిఫీ నిప్పించవా అన్నాడు. అప్పుడు చూసేరూ, వెధవది అణా పారేస్తే పరక ఇడ్లీ, పరక కాఫీ, అడక్కడక్కడిగేడని, అయితే పద అన్నాను. మీరు నమ్మండి! పదకొండణాలూ ఇంకొక మాటలేకుండా తినీసేడు. నాలుగిడ్లీ, ఒక కాఫీ, నాలుగిడ్లీ ఒక కాఫీ అలాగ. అయ్యరు గుండెలు కొట్టుకున్నాడు. మనిషి అందగాడు కాకపోయినా పుష్టిగా ఉండేవాడు. ప్లెయిన్ ఫెలో. మొహంమీద తిడితే ఏం అనుకొనే వాడు కాదు. వెనుక నేదన్నా చేస్తే చంపేసేడని లెఖ్ఖ."

"ఈ బావాజీ సంగతేమిటి మాస్టారూ?" గాలికెగిరిన తలవెంట్రుకలని సరిచేసుకుని మామిడితోట వేపుచూసి అడిగేను. గోదాము వేపు వస్తున్న ఒక లారీ దీపపు కాంతిలో తోట వేపు రెండు కళ్ళు మెరిసేయి. నక్కో! పులో! ఏదన్నా అవొచ్చు. నక్కే అయ్యుంటుం దనుకున్నాను, అట్టే బాధపడకుండా.

"ఒస్తున్నా, ఒస్తున్నా. చెప్పొచ్చే దేంటంటే అతగాడికీ వేదాంతం పిచ్చి, మనుష్యులు, తత్వం, అర్థం చేసుకోడం, వీటిలో ఎక్కువ అభిమానం ఉండేది."

"ఎవరికి? వెంకట్రావుగారికా?"

"మీరు బాగా వింటున్నారే. మరెవడి సంగతి మాట్లాడుతూంట? ఈ బావాజీని చూడ్డంతోటే అతగాడి కేం బుద్ధిపుట్టిందో కాని, కొనామీద చతికిలబడ్డాడు, ఉస్సురుమని. ఇంకొస్త ముందుకి పోదామని ఎంత బలవంతం చేసినా లాభం లేకపోయింది. మనిషి తీరే అంత!"

"ఆఁ. ఐతే?"

"ఐతే కేముంది. కూర్చున్నాం. ఆ సన్యాసిగాడు, దూరంగా ఉన్న కంపునీటి చెరువు వేపు తదేక దీక్షతో చూస్తూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. సమాధిలోంచి అప్పుడే కళ్ళు తెరిచిన ఋషి పుంగవుడిలా ఉన్నాడు. మన వెంకట్రావేం చేసేడో తెల్సా? ఉండుండి బావాజీకి దగ్గర దగ్గరగా జరిగేడు. ఆరోజు ఇతగాడికి నిజంగా పిచ్చెత్తిం దనుకున్నాను. ఈ బొల్లి బావాజీగాళ్ళ దగ్గర నేర్చుకోవల్సిన పరమార్థ మేమిటో నాకు నవ్వొచ్చింది."

ఏ బొల్లిబావాజీ అన్నా దగ్గరుంటే మాస్టారి మాటలకి ఇటో అటో ఏదో ఒకటి చేసును, మొత్తం మీద. కాని ఇక్కడ కూర్చున్న వాళ్ళమంతా అసలు బావాజీగాళ్ళం. సంసార మహాసాగరాన్ని తెప్పలు లేకుండా ఈదుకొస్తున్న వాళ్ళం. ఆ అంతు లేని అగాధంలో మునుగుతూ, తేలుతూ చిరునవ్వుతో పోతున్న వాళ్ళం.

"చిన్న కుశల ప్రశ్న వేసేడు."

"ఏమని?" ఓ చిన్న ప్రశ్న వెయ్యకుండా ఉండలేకపోయేను.

"ఏమనో! అదంతా ఇప్పుడు సరిగా జ్ఞాపకమా ఏమిటి? ఏవో మాటలు కలపడానికి ప్రయత్నించి అందులో జయం పొందేడు. అసలీ బావాజీ, అడిగిన ప్రశ్నలకి ఇష్టమున్న వాటికీ టక్, టక్ మని జవాబిచ్చి మూతి ముడుచుక కూర్చోడం మొదలెట్టేడు, ఏదో దీక్షాపరుడిలా."

"ఒంటిగా పడున్న వాడిని అల్లర పెట్టడంకూడా అన్యాయమే." మధ్యలో అడ్డువస్తూ అన్నాను.

అప్పారావుగారు సందేహం పుట్టి అడిగేరు. "అయితే మాస్టారూ. ఈ బావాజీకి గడ్డం, మీసం

అవీ ఉండేవంటారా, లేక ఈనున్నటిగుండు రఖమా! ఫైలమాన్ మోడల్."

ప్రపంచాన్ని, మనుష్యుల్ని అర్థం చేసుకున్నట్టు చిన్నినవ్వు నవ్వి అన్నారు మాష్టారు. "శరీరదారుఢ్యం ఉన్న మనిషే, కాని ఆరకం కాదు. జానెడు దగ్గర దగ్గర గడ్డాం ఉంది. అదున్నప్పుడు మీసం ఎలానూ ఉంటుంది. అసలు విషయంలోకొద్దాం. మెల్లిగా ఆ బావాజీని దువ్వడం మొదలెట్టేడు వెంకట్రావు. నాకిటువంటి విషయాల్లో స్వతహాగా జోక్యం కలుగజేసుకోడం ఇష్టముండదు. జరిగేదిమాత్రం చూడడం మానను. కొంతసేపు పోయేక అసలు ప్రశ్నలపట్టీ తీసేడు మావాడు. "ఏ ఊరు? గోదావరిజిల్లాలోనా? అంటే ఫలానా ఊరికి దగ్గరేనా? అయితే అక్కడ ఏం చేస్తున్నట్టు. ఏదోవృత్తా! అంటే ఏవృత్తి? పోనీ పెళ్ళయిందా? ఎందరు పిల్లలు? చదువుకుంటున్నారా? మీవయస్సు? ఈపరివర్తన ఎందుకు కలిగింది? వైరాగ్యమా? విరక్తా? మోక్షమార్గం కావల్నా? ఇలా ఎన్నెన్నో. మావాడిన్ని ప్రశ్నలు వేసినా ఒక్క ఊరుపేరుమాత్రమే చెప్పి ఆ సన్యాసిగాడు బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నాడు. జపం చేస్తున్నాడా అంటే అదీలేదు. గుడ్లు మిటకరించుకుని. కంపు చెరువుదగ్గరి చెట్లుమీది కాకుల్ని కామోసు చూస్తున్నాడు మఠం వేసుకుని. ఏమనుకోవాలి చెప్పండీ అలాటివాణ్ణి. మావాడొదుల్తాడూ. అదేపనిగా జవాబురాని ప్రశ్నల్ని తిరిగి అతడిమీద ప్రయోగించడం మొదలెట్టేడు. బావాజీకి చిరాకేసిందిలా ఉంది. ముఖం ఎర్రగా చేసుకున్నాడు. కనురెప్ప లొకటి రెండుసార్లు ముడిచేడు. ఒకసారి మా అందరివేపూ ఏదో ఫిర్యాదున్నట్టుగా చూసేడు. ఆఖరికి లాభం లేదని నోరువిప్పేడు. అంతరిక్షంనుంచి ఆకాశవాణి పలుకుల్లా ఉండేవి బావాజీమాటలు. ఎంత గంభీరంగా ఉందంటారేమిటి ఆగొంతు. "ఎందుకు నన్నిలా బలవంతం చేస్తారు" అన్నాడు.

మా వెంకట్రావు వూరుకున్నాడు, ఒక నిముషం. తరువాత అతడి కష్టసుఖాలన్నీ తనవే అన్నట్టు ముఖం పెట్టి అన్నాడు. 'మనుష్యులం మనం. ఈ జన్మెత్తాక అన్నీ ఏవో ఉంటూ ఉంటాయి. అవి తగినవారి ముందు వెళ్లబోసుకుంటే కొంత మనశ్శాంతి. చూడండీ. నేనూ ప్రపంచంలో వేడీ చలీ అన్నీ చూసేను. ఈ వేదాంతంకూడా కొంతకొంత అర్థం చేసుకుంటున్నాను.'

మావాడిని అట్టే పోనివ్వలేదు బావాజీ. కళ్లోకసారిమూసి, విప్పి, మఠం మార్చి, కాళ్ళు క్రిందకు వేలవేశాడు. కుడికాలి బొటనవ్రేలితో భూమినికొట్టి ధూళినెగరేస్తూ దీర్ఘనిశ్వాసం వదిలి, ఆకాశంమీద పోయే కొంగల్ని చూస్తూ అన్నాడు.

"ఏవస్తువనీ గాఢంగా ప్రేమించకూడదు. అది బానిసత్వమే. దానినుంచి దూరమైతే మతిపోతుంది".

బావాజీ ఊరుకున్నాడు. అంతా నిశ్శబ్దంగా వింటున్నాం ఆ వేదవాక్కుల్ని.

కాలిపోయిన చుట్టని దూరంగా ఉన్న కాలవలోనికి విసిరేరు మాష్టారు. రసంలేనివాటి కదేదారి.

డ్రయివరు చక్రం విప్పి ట్యూబుకి అతుకు వేస్తున్నాడు.

నేనన్నాను నవ్వుతూ—"అయితే ఆ పరమార్థం నిజమేనంటారా మాష్టారూ."

"ఏమో! ఎవడికి తెలుసు? నాకే వేదాంతమన్నా అర్థమయితేగా? అయితే జరిగిం దేమిటంటే. ఆ బావాజీ తన జీవితచరిత్ర మొదలెట్టేడు. ఏవేవో చెప్పిచెప్పి ఆఖరికి అసలువిషయంలోకిదిగేడు. చెవులు రిక్కించుకుని మేమంతా వింటున్నాం.

"నాభార్య నన్నెక్కువగా ప్రేమించేదని గర్వపడేవాడిని. అది, సమయమొచ్చినప్పుడు నాకోసం దేన్నన్నా వదులుకోడానికి సిద్ధమయ్యేది. ప్రాణం కూడా ఇవ్వడం ఈలోకంలో ఎంత ప్రేమించుకున్న వ్యక్తుల్లోనూ అసాధ్యమైనా, నాకా అవసరం పడలేదు. ఆ లేత, సన్నపాటి వ్రేళ్ళతో నా తలనెండ్రుకలని సరిజేస్తూ, నా కన్నులలోకి ఏవో నాలో దాన్ని అర్థం చేసుకున్నట్టు, నా గుండెలలోకి తొంగిచూస్తూ చిరునవ్వు నవ్వేది. వంపులు తిరిగిన ఆ ఎర్రటి పెదవులవెనుక దాగొని ముత్యాలలా తొంగిచూసేవి రెండు మూడుపళ్ళు, ఆకళ్ళలో ఎంత వెలుగు!

నిగనిగలాడే ఆ నల్లటి పొడుగాటిజుత్తు బెంగాలీ ముడివేసుకుంటే దానిచుట్లలో నన్ను కట్టేసేటట్టుండేది. ఒకనాడు, కొత్తగా తెచ్చిన వాయిలు చీర, పల్చటి రవిక వేసుకుంది. జిలేబీలా జుత్తు ముడివేసుకుని, అప్పుడే విడ్డ గులాబీ ముడుచుకుంది. చెవులకి ఉంగరాల్లాటి చుట్లు. చంటిపిల్లలాటి అమాయకపు నవ్వు పెదవులమీద. గుండెలు కదిల్చే ఆ నవ్వుతో నాదగ్గర కొచ్చింది. నాకళ్ళు చాలవనిపించింది, నిజంగా. అంత డబ్బు కర్చుచేసేవాణ్ణి, దాని మెడలో

కోగొలుసు కొనలేక పోతున్నానే ఎందుకు పనికొస్తా ననుకో నేవాణ్ణి.

ఏ వస్తువా కొనమని అడిగేదికాదు. ఇస్తే వాడు కొనేది. లేకపోతే లేదు. నేను తిననిదే ఒక్క మెతుకు ముట్టుకోనేది కాదు. ఓసారి, ఆరాత్రే క్యాంపునుంచి తిరిగొస్తానని చెప్పి ఒక ఊరువెళ్లేను. రావడం ఆలశ్యమయింది. రాత్రి ఒంటిగంట యుంటుంది. పైటచెంగు నేలమీద పరుచుకుని పడుక్కుంది. అంతదాకా పస్తుంది!

కల్ల, కపటంలేని ఆ నవ్వుతో, నా కళ్ళలోకి చూస్తూ, దగ్గరకొచ్చి నా గుండెలమీద తల వాన్చుకుంది. దాని తల నిమురుతున్నాను నేను. నా చేతుల మీద వేడినీటి చుక్కలు పడుతున్నట్టనిపించింది. గబుక్కున దాని ముఖమెత్తి చూసేను కళ్ళలోకి. ఏడుస్తోంది. ఏడుపు నాపుకోనేటందుకు ప్రయత్నిస్తూ అంది మెల్లగా." 'ఎప్పుడూ ఇలా ఉండిపోగలమా?'

కన్నీళ్ళు తుడుస్తూ అన్నాను. 'వాడి దయుంటే!'

ఈ రెవెన్యూ ఇన్స్పెక్టరు పని తెలుసుకదూ? నెలకి ఇరవైరోజులు తిరుగుడు. ప్రక్కనే ఉన్న పోలీసిన్స్పెక్టరుగారి పెద్దబ్బాయి ఏ కూరా గాయా కావల్సినా తెచ్చిపడేస్తూ ఉండేవాడు. కుర్రాడు బుద్ధిగానూ, మర్యాదగానూ ప్రవర్తిస్తూ ఉండే వాడు.

బావాజీ కొంతసేపాగి, పొడిదగ్గు దగ్గి అన్నాడు. 'ఆడదాన్ని మొగాడన్నా మొగాణ్ణి ఆడదన్నా ఎక్కువగా ప్రేమించుకో కూడదు "

"అయితే మాష్టారూ" అన్నా న్నేను ఎందుకో.

"చెప్పేది వినలేం. ఆ బావాజీ ముఖం ఎలా ఉండే దనుకున్నారు చెప్తూ ఉంటే. కందిపోయి, ఏదో తప్పుచేసిన వాడిదానిలా ఉంది. చెప్పక పోయేడు, బావాజీ.

'ఓనాడు నాకో ఉత్తరం ఒచ్చింది. చదివేను. నవ్వొచ్చి, చింపిపారేసేను. ఐనా, మనస్సులో అది చిన్న విత్తు నాటింది.

వారంరోజులైంది. నా పనులు నేను చేసుకుంటున్నాను.

క్యాంపు వెళ్తున్నా ననగానే, లలిత బేజారెత్తి పోయేది. ఒక్క నిముషం దాని ఎదురుగా నే లేకపోతే ప్రాణంపోయి నట్టయిపోయేది. అది కళ్ళు తడిచేసుకోకుండా నేనొక్కనాడు బండీ ఎక్కలేదు. నన్నొక దేవతలా చూసేది.

మరోనాడు క్యాంపు పోయేముందొక కవ రొచ్చింది. విప్పిచదివేను. ఆ రాసినవాడిమీద ఎంత కోపమొచ్చిందో చెప్పలేను. లలిత ఎదురుగా నిల్చుంది నా కళ్ళలోకి చూస్తూ అమాయకంగా. ఉత్తరం దాని కందిచ్చేను. ఆత్రంగా చదివి తిరిగి నా కందిచ్చింది. దానికళ్లు వాడిపోయేయి. చెక్కిళ్లలోని రంగుపోయింది. బిత్తరపోయినట్టు కళ్ళు పెద్దవి చేసి చూస్తూ నా దగ్గరకొచ్చి నా గుండెలమీద వాలిపోయింది, వెక్కి వెక్కి ఏడుస్తూ. ఆ ఏడుపులో వినిపించేయి దానిమాటలు. 'ఆడదాన్ని నేనేం చెప్పగలను."

బావాజీ నిట్టూర్చి ఆగేడు. బూడిదచేతులతో తలరాసుకుని, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ అన్నాడు. 'మొగాడి సంగతి చూడండీ. పెళ్లాం పతివ్రతయినా, రోడ్డు పోయేవా డొక్కమాటంటే, ఆలోచించక మానడు. మేక, దొంగలకథ తెల్సుకదూ?' కొంచం ఊరుకుని అన్నాడు. 'ఇంకో వారంరోజులకి మరొక ఉత్తరం ఒచ్చింది. ప్రతిఒక్క ఉత్తరం నా మనస్సులో ఆ అక్షరాలని ఒక దొంతరగా పేరుస్తూ, దారాన్ని పేనుతూ ఉండేవి. కాని మనుష్యులం! నేను నమ్మలేదే అనుకోండి.

మరొక ఉత్తరం ఒచ్చింది. అందులో ఒక చిన్న ఉపాయంకూడా రాసుంది. ఈ ఉత్తరాల బాధపడలేకపోయేను. అసాధ్యం అయింది. నామనస్సు బాధకూడా నేమో!"

మాష్టారింకోచుట్ట ముట్టించేరు ఆ గిద్దె లైటరుతో. మంచి పట్టులోఉన్న కథ నాపి చుట్ట ముట్టించడం నా కిష్టంలేకపోయింది. కాని ఆ చుట్టతో కథకి మరింత రసం పొయ్యేద్దూ ఆ పండుబ్రర.

చుట్ట ముట్టించి అన్నారు మాష్టారు. "బావాజీ సంగతికదూ అనుకుంటున్నాం. ఆ బావాజీ కూడా నే నిప్పు డాపినట్టే కథ నాపేడు, నేలని చూస్తూ. మా అందరికీ పీకలమీద కత్తిపెట్టినట్టుగా ఉండేది. మళ్ళా బావాజీ చెప్పకపోగేడు. పాతబ్రతుకునంతా సరిచేసుకుని ఇంకొకసారి అనుభవిద్దాం అన్నట్టున్నా యతడి ముఖంలోని రేఖలు.

'మూడు రోజులవరకు రాలేనని చెప్పి బయల్దేరే నారోజు. ఇద్దరు బంట్రోతుల్ని వెంటేసుకుని బండీ మీద ప్రక్క ఊరు ప్రయాణం కట్టేను. సాయంకాలం వేసవి. చంద్రు డప్పుడే పైకొచ్చేడు. చల్లగాలి.

నాటు ప్రయాణం. బండీమీద ఎంతో హాయి అనిపించింది. ప్రాణం కుదుటపడ్డట్టయింది. ఎక్కడో తుప్పల్లోంచి ఒక నక్క అరుపు అకేవరుసగా, కోమటి దాని ఏడుపులా.

ప్రక్కఊరు చేరుకోనేసరికి రాత్రి ఎనిమిదయింది. వెంటనే ఇద్దరి బంట్రోతుల్ని పిలిచి, మర్నాడు నేనువెళ్ళి వెంటనే పనిమాసుకోనేందుకు బందోబస్తు కని, అక్కడికి దగ్గరగానున్న ఊరు పంపేను. ఒక పావుగంట కరణంగారి ఇంట్లో విశ్రాంతి తీసుకున్నాను. కాస్త మజ్జిగ పుచ్చుకుని, పెట్టె, పరుపు కరణంగారి ఇంట్లోనే ఉంచి ఆ పండు వెన్నెల్లో బయల్దేరేను.

మాఊరి కింకో అడ్డుదారుంది. ఆదారంట బండీ వెళ్లేందుకు సాధ్యపడదు. కాని, దారి అక్కడక్కడ తప్పించి కాలినడకకి సాఫీగానే ఉంటుంది. అంత వేగంగా నేనే నాడూ నడవలేదు. మధ్య నొక సెలయేరుంది. నీరు ఎండిపోయింది. ఎదురుగా పెద్ద టేకు తోట. ఆ తోటలోనుంచే వెళ్లాలి. అడివి మల్లెల వాసన. దానికితోడు పువ్వులా చల్లటి వెన్నెల. ఇంత హాయిగా ఉన్నా ఏదో తప్పుచేస్తున్నట్టు, తెలివి తక్కువగా ప్రవర్తిస్తున్నట్టు చిన్న నూది పోటెక్కడో తగుల్తోంది.

మాఊరి పొలిమేర ఒక గంటన్నరలో చేరుకున్నాను.

మా ఇంటిచుట్టూ ఇటికలగోడ ఉంది. గోడకున్న ద్వారపుతలుపు వేసుకుని, ఇంటి తలుపులన్నీ తీసేసి పడుక్కునేవాళ్లం వేసవిలో.

పెరటిదారంటవెళ్లి గోడగెంతేను. మానుయ్యి, కొబ్బరిచెట్టు, అంటుమామిడిచెట్టు ఇంటి కాపలావాళ్లలా నావేపు చూస్తున్నట్టనిపించింది.

ఒకమూల చెప్పలేని సిగ్గువేస్తోంది.

పెరటిద్వారం తెరిచేఉంది. లలిత ఆద్వారం ఎప్పుడూ తెరిచే ఉంచమంటుంది నన్ను, గాలికోసం.

ఆ ద్వారంగుండా చడి చెయ్యకుండా ఇంట్లో ప్రవేశించేను. మా పడకగది ద్వారంముందాగేను, సంకోచిస్తూ.

చెవిమీద వాలిన ఈగని కొట్టడంలో చెవిని కొట్టుకుని అన్నాడు బావాజీ. 'తగ్గించిన దీపపు వెలుగు పడుతోంది తెల్లటిగోడమీద. నా పెద్ద ఫోటో వాడిపోని పూలదండతో ఒకప్రక్కకు కనిపిస్తోంది. దాని చట్టానికి అగరువత్తులు.

ఇంట్లో ఏచప్పుడూ లేదు. మంచి నిద్రలో ఉంటుందనుకున్నాను. నామీద నాకే అసహ్యం పుట్టుకొచ్చింది. నాఇంట్లో నేను దొంగలా!

రెండు చేతులతోనూ ద్వారాన్ని పట్టుకుని తొంగిచూసేను.

బావాజీ ఆగడు. గొంతుక సరిచేసుకుంటూ, మాటల్ని నొక్కుతూ మెల్లిగా అన్నాడు. 'నాభార్య పడుక్కుంది. హాయిగా నిద్రపోతోంది. అమాయకపు కళ్ళతో, పెదవులమీద చంటిపిల్లనవ్వుతో గాఢంగా, ఇంకొకడి ఒడిలో.'

నిట్టూర్చేడు బావాజీ. మేమంతా తెల్లబోయి వెర్రివాళ్లలా బావాజీకళ్లలోకి చూసేం. బావాజీ కంపు చెరువుకేసిచూస్తూ నిరసనగా నవ్వి అన్నాడు, 'ఏం అలా చూస్తారు?

నా మనస్సులో ఏభావాలు కలిగేయో విడదీసి ఇప్పుడు చెప్పలేను. ఏభావాలూ కలగలేదనుకోవడం మంచిది.

ముందుకువెళ్ళి చిన్నదగ్గు దగ్గేను.

ఇద్దరూ ఉలికిపడి లేచి నిల్చున్నారు. వాళ్లిద్దరి ముఖాలూ ఎలా వుండేవనుకున్నారు!

బావాజీ నిరసనగా ఇంకొక నవ్వు నవ్వి అన్నాడు.

నేనో వెర్రివాడిలా వే ప్రవర్తించే ననుకోండి, ఏమనుకోండి. ఆపరిస్థితులలో ఇంకోలా చెయ్యలేకపోయేను.

ఇన్‌స్పెక్టరుగారి అబ్బాయి బుజంమీద చెయ్యివేసి ఏంభయంలేదంటూ ద్వారంవరకు సాగనంపేను తిరిగి నాగదిలోకొచ్చేను. మూర్ఛపోయినట్టు క్రింద పడి నాకాళ్లు రెండూ పట్టుకుంది నాభార్య, వెక్కి వెక్కి ఏడుస్తూ అమాయకంగా, నిష్కల్మషంగా.

నేలమీద అలా సాష్టాంగ పడి వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆడదాన్ని చూస్తే ఎవడిగుండె కరగదు? ఇప్పుడు చెప్తున్నాను. ప్రపంచం, ఒక బ్రతుకు, నే నంటూ ఒక మనిషినీ ఉన్నానంటే లలితవలనే అనుకోనేవాడిని. నేను దానిలో ఒక భాగమే అనుకోనేవాడిని. అదే ప్రపంచం, అదే సృష్టిఅనిపించేది.'

ఒక ఈగని దగ్గరకు రానీయకుండా తోలుతూ అన్నాడు బావాజీ—'దాన్ని లేవనెత్తి అన్నాను, ఎందు కేడుస్తావ్' అని. అది నాముఖం చూసి, రెండు

చేతులతోనూ కళ్లు కప్పుకుని వెళ్లి, పరుపులో తల దాచుకుంది.'

'తరవాత?' ముదలియార రడిగేడు పళ్లు పైకిపెట్టి, అతడు చెప్తూం టే నే.

'దాన్ని బట్టలు లేకుండా చేసి, ఏ వస్తువలూ లేని గదిలో పెట్టి గడియపెట్టేను. ఈ ఆడవాళ్ళతో చెప్పలేం చూడండీ. ప్రక్క ఊరు కబురు పెట్టేను వెంటనే, దాని తల్లిదండ్రులకి, లలితకి జబ్బుగా ఉందని. రాత్రి రెండుకల్లా బండీ చేయించుకుని వాళ్లంతా వచ్చేరు. వాళ్ల అమ్మాయిని, ఆ అమాయకపు చిరునవ్వుతో వాళ్ల కప్పగించేను.'

వెంకట్రావుకూడా అడిగేడు, 'తరవాత,' ఏదో పోతున్నట్టు.

'నేనో దేవతనైనట్టు నా కాళ్లమీద పడ్డారు వాళ్ళంతా. ఇకముందు సరిగా ఉంటుందని దాని తరుపున హామీ ఇస్తూ చేరదీసుకోమన్నారు.'

బావాజీ, ఊరుకోని అన్నాడు అనుమానంగా, 'తెగిపోయిన తివ్వ అతుక్కుంటుందా?'

మావాడి నోటికి అడ్డూ ఆపూ లేదు. 'ఐతే, మీ రెందుకు సన్యసించేరూ?' అడిగేడు, పరమార్థమేదో దొరకనట్టు.

పెదవులు విరిచి, చిన్న నవ్వు నవ్వి, ముఖం త్రిప్పుకున్నాడు బావాజీ."

మాష్టారు, చుట్ట గట్టిగా పీల్చి గాలి వదిలేరు.

గాలితో నిండిన చక్రం లారీ ఎక్కింది. లారీ మొదటి గేరులో ముందుకువస్తోంది, మరాం పెడుతున్న పిల్లవాడిలా.

కృష్ణమూర్తి పనిచేసుకుని ఒక ఘనకార్యం చేసినవాడిలా వచ్చి మాముందు నిల్చున్నాడు.

"మాష్టారోమంచి బావాజీ కథ చెప్పేరోయి—" అన్నాను నవ్వుతూ—

చెట్టుదగ్గర స్టాండు వేసున్న సైకిలుకోసం వెళ్తూ అన్నాడు కృష్ణమూర్తి, ఏదోగా. "ఆ రెవెన్యూ ఇన్స్పెక్టరు కథేనా?"

---

# 'అమృత కేతకి'

★

సాళ్వ కృష్ణమూర్తి

ఎన్ని నాళ్లకు వచ్చె నీహృదయ బంధ
న ప్రవాస శిక్షా మోచనంబు నాకు!
ఎన్ని యుగములు తల్లి! త్వత్సన్నిధాన
పరమ భాగ్య విలుప్తి శాపంబు నాకు!

ఎంత కృశించి పోయితిని యిట్టి నిరాదృతి ప్రాణవల్ల కా
కృంతన తీవ్రమై యెడద గీచిన రాపిడి నే చలించి, శా